సాక్షి తూర్పుగోదావరి

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



అన్నదాన ట్రస్టుకు రూ.50 వేలు


సామర్లకోట: బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలోని అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన ఓ దాత రావుల పాండరీనేత్ర హేమలత పేరున రూ.50 వేలు విరాళం అందించారు.



భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కొరుప్రోలు నాగసూర్యకాంతం (అమలాపురం) రూ 1,00,116 విరాళం అందజేశారు.

1.70 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 1,70,803 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,700 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ ప్రశాంతి



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, ఇమ్యూనైజేషన్ లక్ష్యాలను సాధించడంలో ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖల మధ్య సమన్వయం లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పీహెచ్‌సీ పరిధిలో డెలివరీ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ పరిధిలో ఎక్కువ డెలివరీ కేసులు నమోదు కావడం సంబంధిత మెడికల్ ఆఫీసర్ బాధ్యతకు నిదర్శనమన్నారు. సమ్మె కారణంగా అత్యవసర కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దని, అటువంటి సందర్భాల్లో ప్రజల ప్రాణాలను కాపాడడం కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ విషయంలో బర్త్ ప్లాన్ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. 108, 104 వాహనాలకు వస్తున్న ఫోన్ కాల్స్, పట్టే సమయం, ఏ కేసులకు సంబంధించి సేవలు అందించడం జరిగిందన్న వాటిపై నివేదిక అందజేయాలన్నారు.

విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి బదిలీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా విజిలెన్స్ ఎస్పీగా పనిచేస్తున్న కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు హోం శాఖ నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. ఆయనను పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (పీటీవో)గా బదిలీ చేశారు.

జిల్లాలో 20.7 మి.మీ వర్షం

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో సరాసరి 20.7 మి.మీ వర్షం కురిసింది. రాజమహేంద్రవరంలో గరిష్ఠంగా 42.6 మి.మీ నమోదైంది. మండలాల వారీగా పెరవలిలో 39.2, రాజానగరం 37.4, కడియం 34.2, ఉండ్రాజవరం 32.6, రంగంపేట 31.8, రాజమహేంద్రవరం రూరల్ 29.2, కొవ్వూరు 28.8, తాళ్లపూడి 23.2, సీతానగరం 22.4, కోరుకొండ 17.0, నిడదవోలు 15.6, గోకవరం 15.0, బిక్కవోలు 10.2, చాగల్లు 8.4, అనపర్తి 4.8 చొప్పున కురిసింది. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో మినహా మిగిలిన మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది.

3 నుంచి 21 వరకూ టెట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్ 2024)లను అక్టోబర్ 3 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా పాఠశాలల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొదటి సెషన్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. రాజమహేంద్రవరంలోని లూథర్‌గిరిలో ఉన్న రాజీవ్ గాంధీ కాలేజీలో ఐయాన్ సెంటర్‌లో పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్ వెనుక ఇచ్చిన సూచనలను అనుసరించి పరీక్షకు హాజరుకావాలన్నారు. సుమారు ఎనిమిది వేల మంది టెట్ పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం డిపార్ట్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించామన్నారు.

త్యాగయ్యలకు మొండిచెయ్యి!

- నామినేటెడ్ పదవుల్లో ఆశావహులకు భంగపాటు
- ఎమ్మెల్యే సీట్లు త్యాగం చేసిన టీడీపీ సీనియర్ నేతలకు దక్కని అవకాశం
- రాజమహేంద్రవరం రూరల్ నేతలకు చుక్కెదురు
- పదవుల కోసం సీఎం వద్దకు ఎమ్మెల్యే బుచ్చయ్య
- రాజానగరం టీడీపీ నేత బొడ్డు వెంకటరమణ చౌదరికి పరాభవం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు జవహర్‌కు ఝలక్
- నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు శరాఘాతమే
- తూర్పుగోదావరి జిల్లాకు డైరెక్టర్ పోస్టులతో సరి
- బాబు వైఖరిపై జనసేన, బీజేపీ నేతల గుర్రు




బూరుగుపల్లి శేషారావు



బొడ్డు వెంకటరమణ చౌదరి



కేఎస్ జవహర్



బాబు మార్కు ఝలక్‌తో తమ్ముళ్లు విలవిలలాడుతున్నారు. 'పొత్తు ధర్మం కోసం మీ ఎమ్మెల్యే సీట్లను త్యాగం చేయండి. మన ప్రభుత్వం వచ్చాక సముచిత స్థానం కల్పిస్తాను' అని నాడు హామీ ఇచ్చిన చంద్రబాబు నేడు నామినేటెడ్ పదవుల భర్తీలో వారికి మొండిచెయ్యి చూపారు. కూటమిలో భాగస్వాములమైన తమకూ పదవులు దక్కుతాయని భారీగా ఆశలు పెట్టుకున్న జనసేన, బీజేపీ నేతలకు నిరాశే ఎదురైంది. రాష్ట్రవ్యాప్తంగా 20 కార్పొరేషన్ల పదవులు భర్తీ చేయగా తూర్పుగోదావరికి ఒక్క చైర్మన్ గిరీ దక్కక పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

సాక్షి, రాజమహేంద్రవరం: నామినేటెడ్ పదవుల భర్తీకి ఎట్టకేలకు మోక్షం లభించింది. మూడు నెలలుగా పదవులపై నెలకొన్న ఎడతెగని ఉత్కంఠకు తెరపడింది. వంద రోజుల పడిగాపుల అనంతరం కనికరించిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 20 కార్పొరేషన్లకు చెందిన వివిధ పదవులు కట్టబెట్టింది. ఇందులో తూర్పుగోదావరి జిల్లా నేతలకు ఘోరా పరాభావం ఎదురైంది. నామ్‌కేవాస్తే అన్న చందంగా ప్రాధాన్యం లేని నాలుగు కార్పొరేషన్ల మెంబర్లుగా నలుగురిని నియమించింది. కూటమి నేతల కోసం ఎమ్మెల్యే సీట్లు త్యాగం చేసిన టీడీపీ నేతలకు భంగపాటు తప్పలేదు. జాబితాలో తమ పేర్లు ఉంటాయని అంచనాలు వేసుకున్న నేతలు వంచనకు గురయ్యారు. ఈ పరిణామం జనసేన, బీజేపీ, టీడీపీ సీనియర్ నేతల్లో అగ్రహావేశాలు నింపుతోంది. ఐవీఆర్ఎస్ సర్వే, మంత్రులు, ఇన్‌చార్జ్‌ల సిఫారసులని హడావుడి చేసి చివరకు చినబాబు స్క్రిప్ట్ ప్రకారం పదవులు కట్టబెట్టారని అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ప్రకటనలు గుప్పించిన సీఎం చంద్రబాబు 'ఏరు దాటాక తెప్ప తగలేసి'న చందంగా వ్యవహరించారని గుర్రుగా ఉన్నారు.

వెంకటరమణ చౌదరిని వరించని ఏపీఐఐసీ చైర్మన్

రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరికి నామినేటెడ్ పదవుల్లో భంగపాటు ఎదురైంది. రాజానగరం టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆయన సార్వత్రిక ఎన్నికల్లో రాజానగరం ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. ఎమ్మెల్యే స్థానం జనసేనకు కేటాయించి తీరని అన్యాయం చేసింది టీడీపీ. ఇందుకు నిరసనగా అప్పట్లో వెంకటరమణ చౌదరి వర్గీయులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. చంద్రబాబు పర్యటనను సైతం అడ్డుకున్నారు. ఆయనకు ప్రభుత్వంలో కీలక పదవి ఇచ్చి గౌరవిస్తానని స్వయంగా చంద్రబాబు నాయుడే ప్రకటించారు. ఏపీఐఐసీ చైర్మన్ పదవి వరించనుందని ఊహాగానాలు విస్తృతంగా వచ్చాయి. తీరా జాబితాలో ఏపీఐఐసీ చైర్మన్ పదవికి ఇతరులను ఎంపిక చేయడంతో వెంకటరమణ చౌదరి వర్గం అవాక్కైంది. కూటమి కోసం తన సీటు త్యాగం చేసిన నేతకు అన్యాయం చేయడంపై పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.

శేషారావుకు నిరాశ!

నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత బూరుగుపల్లి శేషారావుకు నామినేటెడ్ పదవి రాకపోవడంతో శరాఘాతం తగిలినట్టైంది. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఆయనకు స్థానం దక్కలేదు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా శేషారావు ఎమ్మెల్యే సీటు త్యాగం చేశారు. ఆయన స్థానంలో జనసేన నేత కందుల దుర్గేష్‌కు కేటాయించారు. ఆ సమయంలో శేషారావుకు సముచిత స్థానం కల్పిస్తామని, ఎమ్మెల్సీ లేదా ఇతర ప్రాధాన్యం ఉన్న పోస్టు ఇస్తానని బాబు హామీ ఇచ్చారు. ప్రస్తుత నామినేటెడ్ జాబితాలో పేరు గల్లంతైంది. ఎమ్మెల్సీ ఎప్పుడిస్తారన్న విషయమై స్పష్టత కరవైంది.

▸▸ ఉండ్రాజవరం మండలానికి చెందిన టీడీపీ మరో సీనియర్ నేత గన్నమని సుబ్రహ్మణ్యం సైతం నామినేటెడ్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఆయనకు సైతం నిరాశే ఎదురైంది.

▸▸ జనసేన నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి, సినీ నిర్మాత డీవీఎస్ఎన్ ప్రసాద్ సైతం పదవి ఆశించారు. పవన్‌కు అత్యంత సన్నిహితుడినైన తనకు కచ్చితంగా పదవి వరిస్తుందని ఆశపడ్డారు. కూటమి ప్రకటించిన జాబితాలో చుక్కెదురైంది.

▸▸ మరోవైపు టీడీపీ నేత కుందుల సత్యనారాయణ సైతం తనను నామినేటెడ్ పదవి వరిస్తుందనుకున్నారు. పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేశారని, తమ నేతకు పదవి దక్కకపోవడం ఏమిటని కుందుల వర్గీయులు చంద్రబాబుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

జవహర్‌కూ దిక్కులేదు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు కూటమి ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు ఎమ్మెల్యే సీటు ఇవ్వకుండా ఘోరంగా అవమానించిన టీడీపీ తాజాగా నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ పక్కన పెట్టేసింది. ఈ పరిణామం జవహర్ వర్గీయుల్లో ఆగ్రహావేశాలు నింపుతోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడికే దిక్కులేకపోతే సామాన్య కార్యకర్తలకు ఏం న్యాయం జరుగుతుందన్న ప్రశ్న కార్యకర్తల్లో ఉత్పన్నమవుతోంది. ద్విసభ్య కమిటీ సభ్యుల అభ్యంతరం మేరకు జవహర్‌కు పార్టీలో ప్రాధాన్యం తగ్గిస్తున్నారన్న వాదన నియోజకవర్గ టీడీపీ నేతల్లో వ్యక్తమవుతోంది.

సీఎం వద్దకు పదవుల పంచాయితీ

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్లపై బుచ్చయ్యచౌదరిపై ఉన్న అసంతృప్తిని మరోసారి చూపించారు సీఎం చంద్రబాబు. పార్టీలో చంద్రబాబు కంటే సీనియర్ నేతైన ఆయనకు మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా అవమానించారు. తాజాగా నామినేటెడ్ పదవులకు ఆయన సిఫారసు చేసిన సభ్యులను ఎంపిక చేయకుండా పక్కన పెట్టేశారు చంద్రబాబు. తన సిఫారసులకే దిక్కులేదన్న విషయం బహిర్గతమైతే నియోజకవర్గంలో తనకున్న పట్టు తగ్గిపోతుందని భావించిన బుచ్చయ్య హుటాహుటిన సీఎంను కలిసేందుకు పయనమయ్యారు. నామినేటెడ్ పంచాయితీ తేల్చుకుని రానున్నట్టు సమాచారం. కడియం మండలానికి చెందిన టీడీపీ నేతలు మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, జనసేన నుంచి గట్టి నర్సయ్య, ముద్రగడ జేమీ, రత్నం అయ్యప్ప, రూరల్ మండలం నుంచి మార్ని వాసుదేవ్, గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, జనసేన నుంచి చెరుకూరి రామారావు, యామన నారాయణలు పదవులు ఆశించారు.

ప్రాధాన్యం లేని పదవులతో సరిపెట్టేశారు

తూర్పుగోదావరి జిల్లాకు నాలుగు కార్పొరేషన్ పదవులు దక్కాయి. అవి కూడా ప్రాధాన్యం లేని పదవులు కావడంతో పదవులు దక్కించుకున్న వారిలో సైతం అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ నేత యర్రా వేణుగోపాలరాయుడును ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ మెంబర్‌గా నియమించారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, జనసేన నాయకురాలు గంటా స్వరూపాదేవిని ఎంపిక చేశారు. పద్మశాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మెంబర్‌గా టి.హరికిషోర్ ఎంపికయ్యారు. చైర్మన్ పోస్టు ఒక్కటీ దక్కలేదు. కేవలం మెంబర్లతోనే సరిపెట్టేశారు.

క్రీడా పోటీలు, విజయాలపై సమీక్ష



జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న 'నన్నయ' అధికారులు

రాజానగరం: గోదావరి జిల్లాలలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు యూనివర్సిటీ ఒక వేదిక కావాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు అన్నారు. అందుకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించి, వారిలో ప్రతిభను ప్రోత్సహించాలన్నారు. యూనివర్సిటీలోని ఈసీ హాలులో బుధవారం యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. 2023-24లో యూనివర్సిటీ పరిధిలో జరిగిన క్రీడా పోటీలు, సాధించిన విజయాలపై సమీక్షించారు. ఇందుకు సంబంధించిన నివేదికను డాక్టర్ బి.రామ్‌గోపాల్ అందజేశారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్ షిప్ 2023-24 బెస్ట్ ఫిజిక్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కె.పవన్ కుమార్, వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకాలు సాధించిన ఈ.కోటేశ్వరరావు, బి.రాజేశ్వరి, బి.చంద్రిక, సీహెచ్.దినేష్‌లను, అలాగే ఆల్ ఇండియా రోప్ స్కిప్పింగ్ మెన్ అండ్ ఉమెన్ టీమ్‌లను, స్పోర్ట్సు కోటాలో ఉద్యోగాలు సాధించిన టి.సీతాభవాని, రెహ్మాన్, ఎం.దీప నయోమి, పి.ధాత్రీ, సీహెచ్ వినయ్‌కుమార్‌లను అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, అధ్యాపకులు, పీడీలు పాల్గొన్నారు.

'నన్నయ'లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

రాజానగరం: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ సెల్ పర్యవేక్షణలో హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. వీటికి బీఎస్సీ మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన 103 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. వారందరికీ రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ చూపిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు హైదరాబాద్, విశాఖపట్నంలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లలో పనిచేయాలని ల్యాబ్ హెచ్‌ఆర్ బి.శరణ్య తెలిపారు. బీఎస్సీ మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీలో 10 మందిని, ఎంఎస్సీ కెమిస్ట్రీలో 28 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, ల్యాబ్ డిపార్టుమెంట్ హెడ్స్ జె.వెంకట సురేష్, బి.అప్పారావు, ఎస్.అశోక్, మురగన్, గజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట

- సమస్యాత్మక కూడళ్లలో నిఘా కెమెరాలు
- నేర సమీక్షలో ఎస్పీ నరసింహ కిషోర్



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మహిళల భద్రతకు పెద్దపీట వేయాలని, సమస్యాత్మక కూడళ్లలో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్సైలు హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, మహిళలపై జరిగే నేరాల దర్యాప్తుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్థిక నేరాలు జరగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్టేషన్ల వారీగా పెండింగ్‌లో, అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. స్కూళ్లు, కాలేజీలు, ముఖ్య ట్రాఫిక్ కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియమాలు, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, యాంటీ డ్రగ్స్, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాలు, సారా, గంజాయిలపై ఉక్కుపాదం మోపాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. అనంతరం నేర పరిశోధనలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

'సిమ్లా'కు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఫోరెన్సిక్ నిపుణుల జాతీయ సదస్సు
- వేదిక కానున్న కాకినాడ ఆర్ఎంసీ
- మూడు రోజుల పాటు నిర్వహణ

కాకినాడ క్రైం: కాకినాడ నగరం ప్రతిష్ఠాత్మక జాతీయ సదస్సుకు వేదిక కానుంది. 20వ సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ (సిమ్లా) జాతీయ సదస్సు-2024కు ఆతిథ్యమిస్తోంది. గురువారం నుంచి జరిగే ఈ సదస్సుకు రంగరాయ వైద్య కళాశాలలోని ఆడిటోరియాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దేశంలో పలు రాష్ట్రాల నుంచి వందల మంది ఫోరెన్సిక్ వైద్య నిపుణులు ఈ కార్యక్రమానికి తరలి రానున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, రంగరాయ వైద్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సును ఆర్గనైజింగ్ చైర్మన్ హోదాలో హెచ్‌వోడీ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ హోదాలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఫణికిరణ్ పర్యవేక్షిస్తున్నారు.



ఆర్ఎంసీ ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ లోగో

8 రాష్ట్రాల నుంచి 491 మంది నిపుణులు

ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్నాటక, గోవా, తమిళనాడు, కేరళ, బీహార్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన 491 మంది ఫోరెన్సిక్ నిపుణులు గురువారం నుంచి ప్రారంభం కానున్న కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్నారు. ఇప్పటికే వీరి నమోదు ప్రక్రియ పూర్తయింది. రంగరాయ పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోని ప్రముఖ హోటళ్లన్నింటిలో వీరి బసకు ఏర్పాట్లు చేశారు.

తరలిరానున్న ప్రముఖులు

సిమ్లా సదస్సులో పాల్గొనేందుకు దేశ వ్యాప్తంగా ఫోరెన్సిక్ మెడిసిన్ సబ్జెక్టుల్లో ప్రముఖులను ఆహ్వానించినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఫణికిరణ్ తెలిపారు. వీరిలో డాక్టర్ సిర్లే వాసు (హెచ్‌వోడీ కేఎంసీటీ మెడికల్ కాలేజ్, కేరళ), డాక్టర్ విందజే భట్ (హెడ్, ఎఫ్ఎంటీ, సిమ్స్ అండ్ ఆర్‌సీ మంగళూరు), డాక్టర్ ఎం.అరుణ (ప్రొఫెసర్, ఎఫ్ఎంటీ, జేఎస్ఎస్ మెడికల్ కాలేజ్, కర్ణాటక), డాక్టర్ బీజీ మహేష్ కృష్ణ (హెడ్, ఎఫ్ఎంటీ, వెలమ్మల్ మెడికల్ కాలేజ్, మధురై), డాక్టర్ టి.సాయి సుధీర్ (హెచ్‌వోడీ, ఎఫ్ఎంటీ, మెడికల్ కాలేజ్, కర్నూల్), డాక్టర్ దాసరి హరీష్ (హెడ్, ఎఫ్ఎంటీ, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, ఛండీఘర్), డాక్టర్ సునీల్ సుబ్రహ్మణ్యం (హెడ్, ఎఫ్ఎంటీ, పీఐఎంఎస్, పాండిచ్చేరి), డాక్టర్ ఎస్‌వీ ఫణీంద్ర (హెడ్, ఎఫ్ఎంటీ, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్, గుంటూరు), డాక్టర్ జయంతి యాదవ్ (ప్రొఫెసర్, ఎఫ్ఎంటీ, ఎయిమ్స్, బోపాల్), డాక్టర్ బి.శాంతకుమార్ (పూర్వపు డైరెక్టర్, మద్రాస్ మెడికల్ కాలేజ్), డాక్టర్ సీబీ జానీ (హెడ్, ఎఫ్ఎంటీ, ఎస్ఏఎల్ ఇన్‌స్టిట్యూట్ అండ్ మెడికల్ సైన్సెస్, అహ్మదాబాద్), డాక్టర్ ఎం.నారాయణరెడ్డి (వైస్ ప్రిన్సిపాల్, మల్లారెడ్డి మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్స్, హైదరాబాద్), డాక్టర్ వి.పవన్ కుమార్ (అసోసియేట్ ప్రొఫెసర్, మిమ్స్, విజయనగరం), డాక్టర్ సూరిబాబు (విశ్రాంత జేడీ, ఆర్ఎఫ్ఎస్ఎల్, ఛత్తీస్‌ఘర్) తదితరులు హాజరుకానున్నారు.

ఐజీ, రిజిస్ట్రార్లు అతిథులుగా...

ఏలూరు రేంజి ఐజీ గోరంట్ల వెంకటగిరి అశోక్ కుమార్, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికా రెడ్డి విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. అలాగే అతిథులుగా రాష్ట్ర డీఎంఈ, డాక్టర్ ఎన్‌టీఆర్ యూహెచ్ఎస్ వీసీ, రంగరాయ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, డాక్టర్ డీపీవీఎస్ శశి హాజరుకానున్నారు.

బహుమతిగా పండూరు మామిడి తాండ్ర

ఫోరెన్సిక్ జాతీయ సదస్సులో మన పండూరు మామిడి తాండ్ర సందడి చేయబోతోంది. దేశంలో పలు రాష్ట్రాల నుంచి వచ్చే వైద్య బృందాలకి పండూరు మామిడి తాండ్ర ప్యాకెట్లను బహుమతిగా ఇచ్చి స్థానిక కమ్మదనాన్ని రుచి చూపాలని నిర్వాహకులు సంకల్పించారు. అందులో భాగంగా నిర్వాహకులు సుమారు 300 కిలోల మామిడి తాండ్రను ఆర్డర్ చేసి సిద్ధం చేశారు. ప్రత్యేక ప్యాక్‌లలో ఓ మధురమైన బహుమతిగా మన మామిడి తాండ్ర సిద్ధమైంది.



కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాల

విజ్ఞానభరితం

భవిష్యత్ ఫోరెన్సిక్ దిశానిర్దేశం (నావిగేటింగ్ ఫ్యూచర్ ఫోరెన్సిక్ హారిజన్స్) అనే థీంతో మూడు రోజుల పాటు ఈ సదస్సు విజ్ఞానభరితంగా సాగనుందని డాక్టర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. 26, 27, 28వ తేదీలలో మూడు రోజుల్లోనూ వివిధ కీలక అంశాలపై నిపుణుల బోధనలు, చర్చాగోష్ఠి కొనసాగుతాయన్నారు.

తొలి రోజు

తొలి రోజు గురువారం వివిధ అంశాలపై ప్రముఖుల ప్రసంగాలు జరుగుతాయి. డిజిటల్ ఫొరెన్సిక్స్, ఇంటర్ డిసిప్లినరీ అప్రోచెస్ టు స్కెలిటల్ ఎగ్జామినేషన్ అమాంగ్ ఫోరెన్సిక్, ఆంత్రాపోలజిస్ట్, ఓడోనోటోలజిస్ట్ అండ్ పాథాలజిస్ట్స్, మెడికల్ హూమానిటీస్, ఎలక్టివ్స్ ఇన్ ఎఫ్ఎంటీ, క్రియోనిక్స్, క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ విక్టిమ్స్ ఆఫ్ ఎంవీ ఆక్సిడెంట్స్, నేవిగేటింగ్ ఇంటర్నేషనల్ లాస్ అండ్ అగ్రిమెంట్స్ అనే అంశాలపై ఇవి కొనసాగుతాయి.


రెండో రోజు

సదస్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం వివిధ అంశాలపై చర్చాగోష్ఠి జరుగుతుంది. ఏ సినాప్సిస్ ఆఫ్ ది పాస్ట్, అండర్ స్టాండింగ్ ది ప్రజెంట్ అండ్ ఏ గ్లింప్స్ ఆఫ్ ది ఫ్యూచర్, డెవలపింగ్ ఫొరెన్సిక్ హిస్టో పాథాలజీ ఏఎస్ ఏన్ ఎసన్షియల్ ఎయిడ్ టు అటాప్సీ ఇన్ ఇండియన్ సినారియో, జ్యూడీషరీ పెర్సెప్షన్ ఆఫ్ మెడికల్ నెగ్లిజెన్స్, డీక్రిమినలైజేషన్ ఆఫ్ సెక్షన్ 309 ఐపీసీ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ మెడికో లీగల్ ఇన్వెస్టిగేషన్ అంశాలపై జరుగుతుంది.

చివరి రోజు

ఇక చివరి రోజు శనివారం బోధనలు, ప్రసంగాలు ఉంటాయి. ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ బాలిస్టిక్స్ ఫ్రం ఏ లీగల్ పర్‌స్పెక్టివ్, మాలిక్యులార్ ఎటాప్సీ ఏస్ఏ డయాగ్నస్టిక్ టూల్ ఇన్ ఎస్‌సీడీ, యుటిలిటీ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ టూల్స్ అండ్ ఎన్‌టోమోలోజికల్ ఎవిడెన్స్ ఇన్ క్రైం ఇన్వెస్టిగేషన్ అనే అంశాలపై ఇవి కొనసాగుతాయి.


ఆనందంగా ఉంది



దేశంలో ఏడాదికి ఒకసారి జరిగే సిమ్లా జాతీయ సదస్సుకు ఈసారి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వేదిక కావడం ఆనందంగా ఉంది. దేశ వ్యాప్తంగా ఐదు వందల మందికి పైగా ఈ సదస్సుకు హాజరు కాబోతున్నారు. ఫోరెన్సిక్ వైద్య విధానాలు, అనుసరణీయ ప్రక్రియల్లో చోటు చేసుకున్న సానుకూల మార్పుల అవగాహనకు ఈ సదస్సు ఎంతగానో దోహదం చేస్తుంది.

– డాక్టర్ ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ చైర్మన్, హెచ్‌వోడీ, ఫోరెన్సిక్, ఆర్ఎంసీ, కాకినాడ

ఏర్పాట్లు పూర్తి



మూడు రోజుల సదస్సు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తరలిరానున్న వైద్యులు, అతిథులకు ఏలోటు రాకుండా ఆర్గనైజింగ్ కమిటీ వారం రోజులుగా కష్టపడి అన్ని ఏర్పాట్లు చేసింది. దీనిలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్ల సహకారం ఎంతగానో ఉంది. కాకినాడ ఆర్ఎంసీలో జరగనున్న ఈ సదస్సు ప్రతి ఫోరెన్సిక్ వైద్యుడికి ఓ జీవిత కాలపు అనుభూతిగా మిగలనుంది.

– డాక్టర్ పి.ఫణికిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసోసియేట్ ప్రొఫెసర్, ఫోరెన్సిక్, ఆర్ఎంసీ, కాకినాడ

క్లుప్తంగా

రేపు నిధి ఆప్‌కే నికత్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిధి ఆప్‌కే నికత్ డిస్ట్రిక్ట్ ఔట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్–2 వైడీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం లెనోరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో, కాకినాడ జిల్లా కాకినాడ అదానీ విల్మార్ లిమిటెడ్‌లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం పీఏసీఎస్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సభ్యులకు సేవలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నిధి ఆప్‌కే నికత్ జరుగుతుందని అన్నారు. ఈపీఎఫ్ఐజీఎంఎస్‌లు, ఇతర ఫిర్యాదుల దాఖలు నిబంధనలు, దావా తిరస్కరణ కారణాలు, స్కీమ్ సర్టిఫికెట్ ప్రయోజనాలు తదితర అంశాలపై జరుగుతుందన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిస్‌మెంట్‌లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిస్‌మెంట్‌లు ఈ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. నిధి ఆప్‌కే నికత్ అని పేర్కొంటూ తమ ఫిర్యాదులను సమర్పించవచ్చన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చని శ్రీనివాస్ కోరారు.

బాబూ... తీయొద్దు మా జాబు

బాబు వస్తే జాబు అన్నారు... కూటమి ప్రభుత్వం వచ్చాక ఉన్నదే ఊడగొడుతున్నారు.. కొత్త మద్యం పాలసీ తెచ్చి ఆ దుకాణాల్లో ఉద్యోగుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేశారు.. వంద రోజుల పాలనలో ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ విధానం ఎంతో మంది ఉద్యోగుల జీవనాన్ని దెబ్బతీయగా, మరిన్ని రోజుల్లో మరింత మందికి ఎలా ఎసరో పెడతారో అని అంతా చర్చించుకుంటున్నారు. ఏదేమైనా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

- వచ్చే నెల 1 నుంచి నూతన మద్యం పాలసీ
- అగమ్యగోచరంగా మద్యం షాపుల్లో ఉద్యోగుల పరిస్థితి
- ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వానికి వినతి



కొత్తపేటలో ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న ఉద్యోగులు

కొత్తపేట: నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి కొందరి ఉద్యోగాలకు ప్రభుత్వం ఎసరు పెట్టింది. అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేస్తామని ప్రకటించడంతో వీరిలో ఆందోళన నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడికి, బెల్టు షాపుల నియంత్రణకు ప్రభుత్వ మద్యం షాపుల నిర్వహణకు ఉద్యోగులను నియమించింది. ప్రభుత్వ పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు నిర్వహించింది. ఈ క్రమంలో పలువురు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు చూపించింది. సూపర్‌వైజర్, సేల్స్‌మేన్, నైట్ వాచ్‌మెన్ తదితర ఉద్యోగాల ద్వారా ఒక్కో షాపులో నలుగురు నుంచి ఐదుగురికి ఉపాధి కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండటంతో తమ భవిష్యత్ ఏంటని వారంతా ఆందోళన చెందుతున్నారు.

అప్పుడిచ్చారు.. ఇప్పుడు తీసేస్తున్నారు

2019కి ముందు మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు దుకాణాలు కేటాయించే వారు. కొన్ని ముఖ్యమైన మద్యం దుకాణాలకు డిమాండ్ ఉండేది. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ సర్కారు ప్రభుత్వ దుకాణాలకు శ్రీకారం చుట్టింది. **అవినీతి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఏపీ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ల ద్వారా** నియామకాలు చేపట్టింది. అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 418 మద్యం షాపులు ఉండగా, 1,590 మంది ఉద్యోగులుగా పని చేస్తున్నారు. సూపర్ వైజర్లకు నెలకు రూ.21,500, సేల్స్‌మెన్లకు రూ.18,500, నైట్ వాచ్‌మెన్లకు రూ.10 వేలు వేతనంగా చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా రోడ్డున పడనున్నారు. ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీసీఓఈడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని బాధితులు వేడుకుంటున్నారు. ఈ మేరకు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు జిల్లా కేంద్రం అమలాపురంలో నిరసన తెలిపి మద్యం డిపో మేనేజర్ దశమంతరావుకు వినతిపత్రం సమర్పించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మద్యం దుకాణంలో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్నాను. నూతన మద్యం పాలసీతో నా ఉద్యోగం ఉంటుందో ఊడుతుందోనని ఆందోళనగా ఉంది. మాలాంటి వందలాది కుటుంబాలు మద్యం దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తమను ఆదుకోవాలి.

–గుబ్బల దుర్గాప్రసాద్, మద్యం ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు, కోనసీమ జిల్లా

రోడ్డున పడకుండా చూడాలి



ప్రభుత్వ మద్యం పాలసీకి మేం వ్యతిరేకం కాదు. అయితే మా కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నాం. ఒక్కసారిగా కొత్త విధానంతో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న మాకు ఇబ్బంది ఎదురవుతోంది. ఉద్యోగ భద్రత కల్పించాలి.

–గొల్లపల్లి చంటిబాబు, మద్యం ఉద్యోగుల సంఘ జిల్లా సెక్రటరీ, కొత్తపేట

మహిళను మోసగించిన వ్యక్తికి 12 ఏళ్ల జైలు

అన్నవరం: పెళ్లి చేసుకుంటానని ఓ మహిళను నమ్మించి మోసగించిన కేసులో ఓ వ్యక్తికి 12 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు బుధవారం తీర్పు చెప్పారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. శంఖవరం మండలం గొంది గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన గంటిమల్లె సతీష్ బెదిరించి వివాహం చేసుకుంటానని, శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం పెళ్లికి నిరాకరించడంతో ఆ మహిళ అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు 2023 డిసెంబర్‌లో అప్పటి అన్నవరం ఎస్‌ఐ బి.అజయ్ బాబు ముద్దాయి గంటిమల్లె సతీష్‌పై అత్యాచారం కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు ఈ కేసు విచారణ జరిపి రాజమహేంద్రవరం ఎనిమిదో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం గంటిమల్లె సతీష్‌కు 12 ఏళ్ల శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మరో ఘటనలో ఏడాది..

కోటనందూరు: స్థల వివాదం కేసులో ముద్దాయికి ఏడాది జైలు, రూ. 10 వేల జరిమానా విధించినట్లు స్థానిక ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2022లో ఇండుగపల్లికి చెందిన గుడివాడ మంగ తన మరిది గుడివాడ వెంకటేశ్వరరావు (నానాజీ) ఇంటి స్థలం విషయంలో గొడవ పడ్డారు. ఇంటి స్థలం తనదని వెంకటేశ్వరరావు మంగపై దాడి చేశాడు. మంగ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. ఈ కేసు బుధవారం విచారణకు రాగా వెంకటేశ్వరరావుకు పైశిక్ష పడింది.



దారి దోపిడీ ఘటనలో నిందితుల అరెస్ట్

రాజానగరం: దివాన్‌చెరువు జీరో పాయింట్ నుంచి గామన్ బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో దారి దోపిడీ చేసిన ఇద్దరిని అరెస్ట్ చేశామని స్థానిక సీఐ ఎం.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీరామపురానికి చెందిన వరద మణికంఠ పండ్ల వ్యాపారం చేస్తూ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లా, కుంటలో నివాసం ఉంటున్నాడు. పండ్ల వ్యాపారంలో భాగంగా ఈ నెల 22న కుంట నుంచి దివాన్‌చెరువు పండ్ల మార్కెట్‌కు తన వ్యాన్‌లో వస్తూ, గామన్ బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో కొంతమూరు సమీపంలో నయారా పెట్రోలు బంకు వద్దకు వచ్చే సరికి బహిర్భూమికి వెళ్లేందుకు ఆగాడు. తర్వాత వ్యాన్ వద్దకు వస్తున్న అతనిపైకి అదే ప్రాంతంలో మాటువేసి ఉన్న కొంతమూరు జంగాల కాలనీలో నివాసం ఉంటున్న సాలా బలరామ్ అలియాస్ డిజె అనే బల్లా, బలం ఏసులు ముఖాలకు ముసుగులు వేసుకుని అతనిపై దాడి చేశారు. అతని మెడపై కత్తి పెట్టి చంపేస్తామని బెదిరించి, చేతికి ఉన్న రెండు బంగారు ఉంగరాలు, సెల్‌ఫోన్, జేబులో ఉన్న రూ.10 వేలను తీసుకుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాజానగరం పోలీసులు రెండు రోజుల్లోనే ముద్దాయిలను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా ఈ కేసులో అరెస్టయిన నిందితులు ఇద్దరూ చెడు వ్యసనాలకు అలవాటు పడి, దొంగతనాలకు పాల్పడి, జైలుకు కూడా వెళ్లివచ్చారు. అయినప్పటికీ వారిలో పరివర్తన రాలేదని సీఐ అన్నారు.

జగ్గంపేట సీహెచ్‌సీలో అరుదైన సంఘటన



జగ్గంపేట సీహెచ్‌సీలో 4.5 కిలోల ఆడ శిశువుతో తల్లి, ఆసుపత్రి వైద్యులు

జగ్గంపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సాధారణ కాన్పు ద్వారా 4.5 కిలోల బిడ్డకు జన్మనివ్వడం అరుదైన సంఘటనని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ తెలిపారు. బుధవారం జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామానికి చెందిన గర్భిణి టి.అచ్చివేణికి నెలలు నిండడంతో కాన్పు కోసం ఆసుపత్రిలో చేరింది. ఆమెకు అన్ని పరీక్షలు నిర్వహించి ప్రసవానికి సిద్ధం చేశారు. ప్రసూతి వైద్య నిపుణులు భాగ్యలక్ష్మి, వర్మ పర్యవేక్షణలో అచ్చివేణి సాధారణ కాన్పులో 4.5 కిలోల బిడ్డకు జన్మనిచ్చింది. అయితే సాధారణంగా కడుపులో బిడ్డ 3.5 కిలోలు ఉంటే కచ్చితంగా ఆపరేషన్ చేసి బయటకు తీస్తారు. అలాంటి అవసరం లేకుండా డాక్టర్లు సాధారణ కాన్పు చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

పరుగులు పెట్టిస్తున్న పులి

- ముమ్మరంగా గాలిస్తున్న అధికారులు
- ట్రాప్, సీసీ కెమెరాల ఏర్పాటు



కడియంలోని ఓ నర్సరీలో ఏర్పాటు చేసిన బోను

రాజమహేంద్రవరం రూరల్/కడియం: కొద్ది రోజులుగా చిరుత పులి అందరినీ పరుగులు పెట్టిస్తోంది.. ఎక్కడా చిక్కకుండా తిరుగుతోంది.. ఎప్పుడు ఎక్కడ ప్రత్యక్షం అవుతుందో తెలియక జనంతో పాటు అధికారులూ తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది.. ఆ చిరుత పులి నుంచి ఎవరికి ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయం అందరిలో వెంటాడుతోంది. కడియం నుంచి వీరవరం వెళ్లే రోడ్డులో దోసాలమ్మ కాలనీ సమీపంలోని ఎస్ఎస్‌టీసీ నర్సరీలో మంగళవారం రాత్రి చిరుతపులి పాదముద్రలు గుర్తించారు. ఇవి దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో తిరిగిన పులి పాదముద్రలతో సరిపోలడంతో అది ఇక్కడకు వచ్చిందని నిర్ధారణకు వచ్చారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులూ ధ్రువీకరించారు. అయితే బుధవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షం కారణంగా పులి పాదముద్రల ఆనవాళ్లు పోయాయి. చిరుతపులి కదలికలను గుర్తించడానికి పలుచోట్ల ట్రాప్, సీసీ కెమెరాలను అమర్చారు. జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి ఆధ్వర్యంలో చిరుతపులి కదలికలను గుర్తించడానికి ఐదు బృందాలుగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. దాని జాడ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి మాట్లాడుతూ వరద సమయంలో గోదావరి మీదుగా వచ్చినట్లు భావించిన చిరుత పులి బుర్రిలంక సమీపంలోని లంకల్లో జింకలు ఉంటాయని అటువైపు వెళ్తున్నట్లు భావిస్తున్నామన్నారు. కడియం నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడామని, వారి పూర్తి సహాయ సహకారాలు అటవీశాఖ సిబ్బందికి అందజేస్తున్నారన్నారు. నర్సరీలో పనిచేసే వారికి, చుట్టుపక్కల గ్రామస్తులకు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. అటవీ శాఖ సిబ్బందికి అంతా సహకరించాలని, అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు. అసత్య ప్రచారాలకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని భరణి హెచ్చరించారు.

చిరుత సంచారంపై ఆరా

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్తూ కడియపులంక గ్రామంలో ఆగి చిరుత పులి సంచారంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ చిరుత పులి అని దాని కదలికలు, పాదముద్రల ద్వారా నిర్ధారించామని వివరించారు. ట్రాప్ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేస్తున్నామని, మనుషులపై దాడిచేసే అవకాశం లేదని, వర్షం వల్ల చిరుత ఎక్కడో నక్కిందని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా చిరుతను పట్టుకుని ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించాలని మంత్రి ఆదేశించారు. దాని కదలికల కోసం ప్రయత్నిస్తున్నామని భరణి మంత్రికి వివరించారు.



నర్సరీలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరా

పనులకు రాని కూలీలు

కడియం నర్సరీల్లో చిరుత పులి సంచారం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో నర్సరీలో పనిచేసే కూలీలు కానీ, ఎగుమతి దిగుమతులు చేసే జట్టు కూలీలు కానీ పనులకు రావడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఈ చిరుత పులిని పట్టుకునే ఏర్పాట్లను వేగవంతం చేయాలని నర్సరీ రైతులు కోరుతున్నారు.

వదినను హత్య చేసిన మరిది



దోకుబుర్ర బుజ్జి (ఫైల్)



బలభద్రపురంలో ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ గణేష్

బిక్కవోలు: వదినను మరిది హత్య చేసిన ఘటన బలభద్రపురం గ్రామంలోని చోటుచేసుకుంది. బుధవారం అనపర్తి సీఐ గణేష్ కథనం ప్రకారం.. బలభద్రపురం కొత్త కాలనీలో దోకుబుర్ర బుజ్జి (40) తన భర్త గణేష్ మృతి చెందడంతో కొడుకు, కూతురితో కలసి ఉంటోంది. తన ఇంటి ఎదురుగానే మరిది దోకుబుర్ర గంగరాజు నివాసం ఉంటున్నారు. గంగరాజు, బుజ్జి కుమారుడు సునీల్‌లు గ్రామంలో ఏదో విషయమై ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో సునీల్ చొక్కా చిరిగిపోవడంతో ఇంటికొచ్చిన కొడుకుని బుజ్జి అడిగింది. దీంతో బాబాయ్ కొట్టాడని చెప్పడంతో బుజ్జి ఎదురింట్లో నివాసం ఉంటున్న మరిది గంగరాజును నిలదీసింది. కోపంతో ఊగిపోయిన అతను వెంటనే అక్కడే ఉన్న రాయితో బుజ్జి తలపై మోదాడు. ఆమె పరుగు పెట్టబోయింది. చీర అడ్డురావటంతో ముందుకు పడిపోయింది. వెనుక వచ్చిన మరిది మళ్లీ ఆమెను కొట్టడంతో తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు వివరించారు. ఈ ఘటనా స్థలాన్ని సీఐ గణేష్, ఎస్సై రవిచంద్ర పరిశీలించారు. వీఆర్వో మాచవరపు శ్రీనివాస ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి సీహెచ్‌సీ తరలించారు. గంగరాజును పోలీసు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మండల స్థాయి అధికారులకు ముగిసిన శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ)లో ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ బుధవారం సాయంత్రంతో ముగిసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ, ఏలూరు జిల్లాల్లోని అధికారులకు ఈ నెల 17 నుంచి ప్రారంభించిన శిక్షణ ముగిసింది. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు, అధికారుల విధులతో పాటు పంచాయతీ రాజ్ చట్టంపై 155 మందికి శిక్షణ ఇచ్చినట్లు ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ జీవీఎస్ శ్రీదేవి తెలిపారు. శిక్షణ పొందిన మండల స్థాయి అధికారులు ఆయా మండలాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు, పద్మజ, పార్థసారథిరావు, కేఎస్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఫ్యాకల్టీ

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్ట్

కె.గంగవరం: బాలికపై అత్యాచారం కేసులో దత్తత తండ్రిని అరెస్టు చేసినట్లు ఎస్సై జానీబాషా బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కె.గంగవరం రైల్వే కాలనీలో సత్తిబాబు తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. సత్తిబాబుకు పిల్లలు లేకపోవడంతో భార్య చెల్లెలి కుమార్తెను దత్తత తీసుకున్నాడు. బాలిక అసలు తల్లి కుటుంబ పోషణ నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లింది. ఈ నేపథ్యంలో దత్తత తీసుకున్న కుమార్తెపై అతను లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె గర్భవతి కావడంతో ఒక శిశువుకు జన్మనిచ్చింది. ఆసుపత్రిలో ఆమె చికిత్స అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో 2022లో కేసు నమోదు చేశారు. దీంతో ఆ కేసును కె.గంగవరం పోలీసులకు ట్రాన్స్‌ఫార్ చేశారు. రెండేళ్ల నుంచి పరారీలో ఉన్న సత్తిబాబును ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి ఆర్టీసీ కాలనీలో కె.గంగవరం పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

చోరీ కేసులో ఏడాది జైలు

రాయవరం: ఆలయంలో హుండీ చోరీ చేసిన ముద్దాయికి అనపర్తి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బుధవారం ఏడాది జైలు శిక్ష విధించారు. మండపేట రూరల్ సీఐ దొరరాజు వివరాల ప్రకారం.. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరాలయంలో 2022 అక్టోబరు 20న హుండీ చోరీ జరిగింది. దీనిపై అప్పటి ఆలయ ఈఓ అయ్యప్ప ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఎస్సై సురేష్ కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌కు చెందిన ఓరుగంటి ఏసు హుండీ పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. సదరు కేసులో వాదోపవాదాల అనంతరం ఏసు నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష పడిందని సీఐ తెలిపారు.

చప్పుడు కాకుండా వస్తారు... దోచుకెళ్తారు

- చోరీ కేసులో ఇద్దరి అరెస్టు
- రూ.15.30 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

కంబాల చెరువు (రాజమహేంద్రవరం): ఇంట్లో అంతా నిద్రిస్తుండగా చప్పుడు కాకుండా వస్తారు.. సొత్తు దోచుకుని దర్జాగా ఉడాయిస్తారు. జిల్లాలోని కొవ్వూరులో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు పాత నేరస్తుల్ని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.15.30 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ రాజమహేంద్రవరం దిశా పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 26న కొవ్వూరు ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో నివసిస్తున్న కట్టా ఉష ఇంట్లో దొంగతనం జరిగింది. వారి కుటుంబ సభ్యులంతా ఇంట్లో నిద్రిస్తుండగానే గుర్తు తెలియని దొంగలు వెనుక గుమ్మం నుంచి ప్రవేశించి బీరువాలోని నగలు, స్కూటీతో ఉడాయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ పర్యవేక్షణలో కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.విశ్వం ఆధ్వర్యంలో సిబ్బందిని రెండు బృందాలుగా విభజించి దర్యాప్తు చేశారు. నిందితుల వేలిముద్రల ఆధారంగా పాత నేరస్తుడైన కాకినాడకు చెందిన ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఉంటున్న పొన్నాడ రవిశంకర్ వీరబాబు, భీమవరానికి చెందిన పాత నేరస్తుడు లంకలపల్లి నాగరాజు ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. వారిపై నిఘా పెట్టి నిందితుల్ని చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి 50 కాసుల బంగారం, సెల్ ఫోన్, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. మణిపురం ఫైనాన్స్ కంపెనీలో వీరు తాకట్టు పెట్టిన కొత్త బంగారాన్ని స్వాధీనం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. పొన్నాడ రవిశంకర్ వీరబాబుపై ఇప్పటి వరకూ తూర్పు, పశ్చిమ, విశాఖ జిల్లాల్లో మొత్తం 44 చోరీ కేసులు ఉన్నాయి. వాటిలో 14 కేసుల్లో శిక్ష అనుభవించి గత ఏప్రిల్‌లో జైలు నుంచి విడుదలయ్యాడు. మరో ముద్దాయి లంకలపల్లి నాగరాజుపై లంకలకోడేరు పోలీస్ స్టేషన్లో హత్యాయత్నం, క్రికెట్ బెట్టింగ్ కేసులు ఉన్నాయి. వీరు జైలుకు వెళ్లి వచ్చినా తీరు మార్చుకోకపోవడం వీరి నేర ప్రవృత్తికి అద్దం పడుతోంది. నిందితుల్ని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

వరద బాధితులకు విరాళం



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విరాళం అందజేస్తున్న చిట్టూరి విజయప్రకాష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ముఖ్యమంత్రి వరద సహాయ నిధికి శ్రీప్రకాష్ విద్యాసంస్థలు రూ.10 లక్షల విరాళం అందజేశాయి. ఈ విరాళాన్ని శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత చిట్టూరి విజయప్రకాష్ విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ సీహెచ్ వీకే నరసింహారావు మాట్లాడుతూ వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు కొంత ఉపశమనం కలగాలనే ఉద్దేశంతో సహాయం చేశామన్నారు. ప్రభుత్వానికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FOR SALE

■ కాకినాడ నుండి యానాం రోడ్డు నందు గల 21 ఎ॥ రొయ్యల చెరువులు అమ్మబడును. ప్రస్తుత లీజు సంవత్సరానికి ఒక ఎకరాకు 1,30,000/- లభిస్తుంది. ఆసక్తి గలవారు సంప్రదించండి. డైరెక్ట్ - 86882 65996 [R-1260812]

Services

GOLD FINANCE



■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2563]

Wanted

■ RICY క్లీనింగ్ ప్రొడక్ట్ కంపెనీకి అన్ని మండలాల నుండి సేల్స్ మేనేజర్స్ జీ: 25K, టెలికాలర్స్, జీ॥ 20K డెవలప్‌మెంట్ మేనేజర్స్ జీ॥ 30K కావలెను. ✆ : 93927 21216 [R-1229098]

■ ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో Team Leaders అమలాపురం మరియు చుట్టుప్రక్కల ప్రాంతాలలో పనిచేయుటకు M/F కావలెను. Q:10th Above. ✆ : 93930 55164 [R-1229099]

■ ప్రముఖ వ్యాపార సంస్థలో వర్క్ చేయుటకు Age 35 సం॥ పైబడి టీమ్ మేనేజర్స్ కావలెను. గృహిణులు కూడా అర్హులు (Retd. Employ & Private Employ కి ప్రాధాన్యత కలదు) కాంటాక్ట్ ✆ : 94907 45099 [R-6989]

■ Wanted for Diagnostic centre (Kakinada & Amalapuram) Lab Technician 2 Nos (M/F), X-ray Technician 2 Nos (M/F), Cont: 9676810372, 9397662312 [C-800082]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, వార్డ్ బాయ్స్, ఆయాలు, లేడి సూపర్‌వైజర్స్ భార్యభర్తలు కావలెను.Ph: 9391036931, 9246585901 [HA-14711]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185455]

■ కష్టలేనీ్ల కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు,ఫ్రీ రూమ్+భోజనం. HYD.7995365999. [HA-98562]

■ హైదరాబాద్‌లో ప్రముఖ యూనివర్సిటీలో 200 మంది (Ex-Army) సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. (జీతం:8Hrs. 19,500/- & 12 Hrs. 28,200/-, 4సెలవులు + ఉచిత వసతి).ఫోన్ 9959433789 [H-804876]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18k. ఫోన్ 9640258899, 9640468899 [H-796281]

■ విజయవాడలో పేషెంట్‌లని, పెద్దవారిని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు నర్సులు (ANM, GNM) హాస్పిటల్స్‌లో పనిచేసిన ఆయాలు, హోమ్‌కేర్‌లో అనుభవమున్న కేర్ టేకర్స్ కావలెను. జీతం 16K-26K కాల్ / వాట్సప్ ✆ 91608 35559, 98850 25559 [B-264]

■ RK ఇంజనీరింగ్ కాలేజి బాయ్స్ హాస్టల్ నందు పనిచేయుటకు వార్డెన్స్, వంట మాస్టర్స్ మరియు ఎలక్ట్రీషియన్స్ కావలెను. మంచి జీతం +భోజనం+ఉచిత వసతి కల్పించబడును. సంప్ర॥ కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం విజయవాడ. సెల్ : 9701473399 [G-209]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.